క్లుప్తంగా

ప్రజలను బెంబేలెత్తిస్తున్న వానరాలు!



సత్తెనపల్లి: పట్టణంలోని తారకరామ సాగర్ వాకింగ్ ట్రాక్‌పై కోతులు బెడద అధికమైంది. ఉదయాన్నే వాకింగ్‌కి వెళుతున్న వృద్ధులు, మహిళలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానరాలు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తుండటంతో నడవడానికి వచ్చిన వాకర్లు బెంబేలెత్తిపోతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా, కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టి సారించి వాకింగ్ ట్రాక్‌పై కోతుల బెడద నివారించడానికి తగు చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

జిల్లా పరిషత్ పాఠశాల సందర్శన



క్రోసూరు: జిల్లా పరిషత్ పాఠశాలకు బుధవారం జిల్లా డైట్ నుంచి పాఠశాల పరిశీలకులుగా డి.పద్మకోటి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం పథకం అమలు, విద్యార్థుల రీడింగ్, రైటింగ్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ కార్యక్రమాల అమలును ఆమె పరిశీలించారు. 6, 7 తరగతుల విద్యార్థులు చదవటం, రాయటంలో కొంత మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ మేరకు ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్త పరిచారు. కార్యక్రమంలో ఎంఈవో గణేష్, పాఠశాల హెచ్‌ఎం బాబూరావు, ఎంపీపీఎస్ స్పెషల్ పాఠశాల హెచ్‌ఎం డి.చంద్రలీల, సీఆర్పీలు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో చోరీ



నరసరావుపేట రూరల్: ఉప్పలపాడు రోడ్డులోని జ్ఞానసరస్వతి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయానికి విద్యుత్ సరఫరా చేసే వైర్‌ను కత్తిరించిన దొంగలు ఆలయంలోకి ప్రవేశించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ తలుపు తాలం పగుల కొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి 1గంటల సమయంలో సెక్యూరిటీ సిబ్బంది దీనిని గమనించి ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన భక్తులతో పాటు నిమజ్జనం బందోబస్తులో ఉన్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీపై రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆలయ కమిటీ డాక్టర్ కేజే మోహన్ రెడ్డి తెలిపారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ఏర్పాటుచేసి భద్రత కల్పించాలని కోరారు.

బడి సౌకర్యం కల్పించండి

నూజెండ్ల: మండలంలోని కమ్మవారిపాలెం యానాదికాలనీ పిల్లలకు బడి సౌకర్యం కల్పించాలని మండల విద్యాశాఖాధికారి రవిచంద్రకు కాలనీ వాసులు, గ్రామ పెద్దలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం చదువుకోవడానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న రెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలకు వెళ్లి రావటం వల్ల చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు గంగినేని బాబు ఎంఈవో దృష్టికి తెచ్చారు. స్థానికంగా అందుబాటులో ఉన్న కమ్మవారిపాలెంలోని పాఠశాలను తిరిగి పునఃప్రారంభించాలని కోరారు. దీంతో స్పందించిన ఎంఈవో రవిచంద్ర పిల్లలు లేకపోవటంతో దశాబ్ద కాలంగా మూతబడి ఉన్న పాఠశాలను సందర్శించారు. పాఠశాల దృఢత్వం, పిల్లల సంఖ్య ఆధారంగా ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుని పాఠశాల తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు.

వీధి కుక్కల బెడద

శావల్యాపురం: మండల కేంద్రంలో వీధి కుక్కల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయం అయితే వీధి కుక్కల ధాటికి ప్రజలు భయానికి గురవుతున్నారు. ప్రధాన కూడలిమార్గంలో వీధికుక్కలు అధిక సంఖ్యలో సంచరించడం వలన చిన్నారులు సైతం వణికిపోతున్నారు. ముఖ్యంగా రైల్వేస్టేషను రహదారి మార్గంలో రాత్రి సమయంలో ఒంటరిగా రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికితోడు వీధిలైట్లు వెలగని సమయంలో వీధి కుక్కలు వలన బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రణ చేయాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పంచాయతీలోనే కొనసాగించండి మహాప్రభో

- భీమవరంను మున్సిపాలిటీలో విలీన ప్రక్రియను ఉపసంహరించుకోవాలి
- రాజకీయాలకు అతీతంగా ధర్నాకు దిగిన భీమవరం గ్రామ ప్రజలు



భీమవరం సచివాలయం ముందు ధర్నా చేస్తున్న గ్రామ ప్రజలు

సత్తెనపల్లి: వ్యవసాయ కూలి పనులను ఆధారంగా చేసుకొని జీవించే పేద ప్రజల పొట్ట కొట్టే ప్రక్రియకు అధికార యంత్రాంగం మొగ్గుచూపవద్దని సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామ ప్రజలు కోరారు. సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామాన్ని సత్తెనపల్లి పురపాలక సంఘంలో విలీనం చేసే ప్రక్రియను వ్యతిరేకిస్తూ గ్రామస్తుడు కొల్లు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సచివాలయం ముందు ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. భీమవరం గ్రామాన్ని పురపాలక సంఘంలో విలీనం చేసే ప్రక్రియను ఉపసంహరించుకోవాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు తక్షణమే విలీన ప్రక్రియను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. గ్రామంలో అందరూ వ్యవసాయ కూలి పనులు వల్ల జీవనం సాగిస్తున్నారని.. వ్యవసాయ కూలీ పనులే జీవనాధారమని తెలిపారు.

మరోచోటికి వలస..!

ఖరీఫ్, రబీ పంటల కాలంలో వ్యవసాయ కూలి పనులు ఉంటాయని.. సీజన్ అయిన తర్వాత ఫిబ్రవరి నెల నుంచి జూన్ నెల వరకు పనులు లేని కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం కింద పని కల్పించడం జరుగుతుందని గ్రామస్తులు అన్నారు. పనులు లేని కాలంలో మరోచోటికి వలస పోకుండా గ్రామంలోనే ఉంటూ జీవనోపాధిని పొందుతున్నామన్నారు. నాలుగు రోజుల క్రితం గ్రామపంచాయతీ కార్యదర్శి పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేసి భీమవరం గ్రామపంచాయతీని సత్తెనపల్లి పురపాలక సంఘంలో విలీనం చేసే అంశంపై గ్రామసభ ఏర్పాటు చేశారన్నారు. గ్రామసభ జరిపిన సమయంలో తామంతా హాజరై తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా గ్రామపంచాయతీ కార్యదర్శికి తెలియజేశామన్నారు. అయినప్పటికీ మా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా పంచాయతీ కార్యదర్శి వారికి తోచిన విధంగా తీర్మానం జరిపించారని గ్రామస్తులు వాపోయారు.

కోల్పోనున్న జీవనోపాధి..

భీమవరం గ్రామపంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేసే విషయం తక్షణమే ఉపసంహరించుకోవాలని.. లేకుంటే తమ జీవనోపాధి కోల్పోయి తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని భీమవరం గ్రామస్తులు వాపోయారు. మున్సిపాలిటీలో విలీనం చేయడం వల్ల ఉపాధి హామీ పథకం కింద కూలీ పనులు చేసే పరిస్థితులు ఉండవన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చెల్లించాల్సిన ఇంటి పన్నులు, వగైరా చెల్లించుకోలేని పరిస్థితి ఏర్పడి పన్నుల భారం తమకు పెనుభారం కానుందన్నారు. తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేసినట్లయితే భీమవరం గ్రామం నుంచి మున్సిపల్ ఆఫీస్ చుట్టూ తిరిగి తమ పనులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల సమయం, డబ్బు వృథా అవుతుందని.. విలీనం కానట్లయితే తమ గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే పనులు సులువుగా పూర్తి చేసుకోగలమన్నారు.

మాకు న్యాయం చేయాలి..



భీమవరం ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ ఉమాశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేసే విషయంలో పునరాలోచన చేసి విలీన ప్రక్రియ నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి తమకు న్యాయం చేయాలని రాజకీయాలకతీతంగా కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి ఉమా శంకర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సోమినేని జగన్నాథరావు, రావిపాటి కోటేశ్వరరావు, గడ్డం బ్రహ్మానందం, మానుకొండ భూపతిరావు, మేకల రమేష్, మేకల సాంబయ్య, నలజాల శ్రీనివాసరావు, ఒంటిపులి శంకర్, చల్లా బాలనాగేశ్వరరావు, ఒంటిపులి నాగరాజు, ఒంటిపులి దానయ్య, పాలేటి పిచ్చయ్య, పాలెపోగు బాలయ్య, రావినూతల గురవయ్య, మందా వెంకయ్య, పాలెపోగు పెద్ద సుబ్బయ్య, నిశనం లక్ష్మయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ

ఏడీఏ మస్తానమ్మ



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ

అచ్చంపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు కావాల్సిన యూరియాను సరఫరా చేయనున్నట్లు ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేల్పూరు పీఏసీయూ కార్యాలయంలో రైతులనుద్దేశించి ఆమె మాట్లాడారు. ముందుగా పీఏసీయస్ గోడౌన్‌లో యూరియా నిల్వలను పరిశీలించారు. మండలంలో యూరియా కొరత లేదన్నారు. అధిక ధరలను నియంత్రిస్తామని చెప్పారు. రైతులంతా రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదులు చేయించుకోవాలన్నారు. అలా చేయించుకున్న వారికే పంట పరిహారాలు వంటి ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని వివరించారు. కౌలు రైతులంతా తప్పని సరిగా ఋణ అర్హత పత్రాలను తీసుకోవాలన్నారు. ఋణ అర్హత పత్రాల కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. ఆమె వెంట ఏవో పి.వెంకటేశ్వర్లు, సొసైటి అధ్యక్షులు జువ్వా రామారావు, డైరెక్టర్ కె.లక్ష్మణ్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రామాంజనేయపురంలో పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

బెల్లంకొండ: మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం పంచాయతీ పరిధిలో గల రామాంజనేయపురం గ్రామంలో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు బుధవారం పాఠశాలను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాల నిర్మించినప్పటికీ కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు పాఠశాలలో విద్యా బోధన ప్రారంభించలేదు. దీంతో గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గతవారం గ్రామాన్ని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సందర్శించారు. వెంటనే పాఠశాలను ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం గ్రామంలో పాఠశాలను గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్నా సాంబశివ రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో పాఠశాల ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి బాలసుందర్‌రావు, మండల నాయకులు ఎస్‌కే మస్తాన్ షరీఫ్, అక్కల వెంకటరామిరెడ్డి, నల్ల మేకల లక్ష్మీనారాయణ, వర్ల వెంకటేశ్వర్లు, ఆసుల జగన్, వెన్న వెంకటరెడ్డి, ఓర్చు ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

వెళ్లి రావయ్యా.. ఏకదంతుడా

- కొనసాగుతున్న గణపతి నిమజ్జనాలు
- గంగమ్మ ఒడికి గౌరీ తనయుడు



ధూళ్ళిపాళ్లలో ట్రాక్టర్ నడుపుతున్న సుధీర్ భార్గవ్ రెడ్డి

సత్తెనపల్లి: గణపతి బప్పా మోరియా.. గణేష్ మహరాజ్ కీ జై అంటూ పుర వీధులు మార్మోగాయి. బుధవారం వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సత్తెనపల్లి పట్టణం, మండలంలోని పలు గ్రామాలు ఆధ్యాత్మిక సాగరంలో ఓలలాడాయి. గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని పురస్కరించుకొని గ్రామాలు, వార్డులు కిటకిటలాడాయి. భక్తుల ఆనంద వేడుకల నడుమ విగ్రహాల ఊరేగింపు కనులపండువుగా సాగింది. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల, కట్టావారిపాలెం గ్రామాల్లోని వినాయక మండపాలను వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనంపై నిమజ్జనానికి ఏర్పాట్లు చేయగా ఆయా వాహనాలను ఆయన ప్రత్యేకంగా నడిపారు. చిన్నారులతో కలిసి సందడి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, నాయకులు చిలుకా జైపాల్, నల్లబోతు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో మహిళా సర్పంచుల భాగస్వామ్యం కీలకం



మహిళా సర్పంచులు, అధికారులతో డీఎల్‌డీవో రాజగోపాల్

సత్తెనపల్లి: పాలనలో మహిళా సర్పంచులు భాగస్వామ్యం కీలకమని డీఎల్‌డీవో రాజగోపాల్ అన్నారు. సత్తెనపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మహిళా, బాలికల స్నేహపూర్వక గ్రామ పంచాయతీల జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ శిక్షణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలనలో మహిళా సర్పంచుల భాగస్వామ్యం, లింగ ప్రతిస్పందన ప్రణాళిక, బడ్జెటింగ్ అనే 6 అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణకు సత్తెనపల్లి మండలం నందిగామ, గురజాల మండలం దైద, దాచేపల్లి మండలం కొత్తూరు, గామాలపాడు, యడ్లపాడు మండలం దింటెనపాడు గ్రామాల నుంచి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా శిశు సంరక్షణ కార్యదర్శులు, సంక్షేమ విద్యా కార్యదర్శులు, వీఆర్‌వోలు, ఏఎస్ఎంలు, యానిమేటర్‌లు హాజరు కాగా నందిగామ పంచాయతీ కార్యదర్శులు కుంభ వెంకటేశ్వర్లు, చిలువూరి కృష్ణ ప్రసాద్, మహిళా శిశు సంరక్షణ కార్యదర్శి బి.పావనిలు మాస్టర్ ఆఫ్ ట్రైనర్‌లుగా వ్యవహరించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ గురువారం కూడా కొనసాగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో షేక్ అజీజుర్ రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ విజయ సుందర్ దాస్, అసిస్ట్ ట్రైనర్ చెంబేటి బొల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు 11 మందిని ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు లయన్ బండ్లమూడి వీరాంజనేయులు బుధవారం తెలిపారు. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) బీసీహెచ్ వెంకటేశ్వరరాజు, అచ్చంపేట మండలం మాదిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొండవీటి శాంతకుమారి, సత్తెనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఆర్ఎస్) సెకండరీ గ్రేడ్ టీచర్ కన్యదారి ఆనందరావు, బెల్లంకొండ మండలం వన్నాయపాలెం ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు బొమ్మనబోయిన హృదయరాజు, చింతపల్లి తండా ఎంపీపీఎస్ సెకండ్ గ్రేడ్ టీచర్ షేక్ నాగుల్ షరీఫ్, సత్తెనపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల పీడీ ఆరిక శ్రీరామిరెడ్డి, రాజుపాలెం మండలం గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (గణితం) తోట శ్రీనివాసరావు, సత్తెనపల్లి శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ ప్రిన్సిపాల్ మిట్టపల్లి గీతాంజలి, ముప్పాళ్ళ మండలం బొల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ పండిట్ కన్నా మంజుల, సత్తెనపల్లి మండలం బృగుబండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండ్ గ్రేడ్ టీచర్ తురకా రాజు, సత్తెనపల్లి అమరావతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మంగెనపూడి శ్రీకాంత్‌లను ఎంపిక చేశారు. ఈనెల 5న పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని సాయిబాబా మందిరం ఎదురుగల ఐఎంఏ హాల్లో నిర్వహించే గురుపూజోత్సవంలో వీరికి సత్కారం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అగ్నిమాపక అధికారి కాపు సత్యనారాయణ, విశిష్ట అతిథులుగా గుంటూరు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ రైల్వేపోలీస్ పాపిశెట్టి కరుణాకరరావు, సత్తెనపల్లి ఎంఈవో–1 అనంతవరం శ్రీనివాసరావులు హాజరవుతారన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా లయన్ మంచికంటి వెంకటేశ్వరరావు, లయన్ వైపీ మురళీకృష్ణ వ్యవహరిస్తారన్నారు. ఆయనతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ కార్యదర్శి లయన్ ఎం.రమేష్ బాబు, కోశాధికారి లయన్ బి.రోశయ్య, ప్రోగ్రాం చైర్మన్ కర్నాటి వెంకటరెడ్డి ఉన్నారు.

పొలం పిలుస్తోందిలో రైతులకు అవగాహన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు

పెదకూరపాడు: మండలంలో కాశీపాడు, తమ్మవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కృష్ణయ్య పత్తి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. ప్రైవేట్ ఎరువుల వ్యాపారులతో పాటుగా ఎరువులు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు గ్రామ రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఎరువులు సరిపడా వస్తున్నవి కావున రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందికి సహకరించాలన్నారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ కూడా విరివిగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.



విప్పర్ల గ్రామంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో వేణుగోపాల్

క్రోసూరు: మండలంలోని విప్పర్ల, ఊటుకూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ఏవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగులో ఉన్న పత్తి పంటను ఏవో రైతులతో కలిసి పరిశీలించి సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తామర పురుగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇవి బెట్ట వాతావరణ పరిస్థితుల్లో అధికంగా పంటను ఆశించి లేత ఆకులు, కాండాల నుంచి రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు గిడస బారి సరియైన ఎదుగుదల లేకుండా కనిపిస్తాయని అన్నారు. వీటి నివారణ చర్యలను రైతులకు ఆయన వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది బి.శీనునాయక్(ఊటుకూరు), గోపి(విప్పర్ల), రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న దేవదాసు

నకరికల్లు: వరిలో కలుపు యాజమాన్య పద్ధతులే కీలకమని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు ఎం.పవన్‌కుమార్, సర్పంచి నాగోతు దానయ్య, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



పట్టాలు అందుకున్న విద్యార్థులతో నీలావతిదేవి

సత్తెనపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల వేద విద్యాసంస్థల విద్యార్థుల క్యాప్ బహూకరణ కార్యక్రమంలో బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యురాలు ఫణి ప్రశాంతి నర్సింగ్ విద్యార్థుల చేత వృత్తి ప్రమాణం చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్తెనపల్లి ప్రాంతంలో విభిన్న కోర్సులను విద్యార్థులకు చేరువ చేస్తున్న వేద విద్యా సంస్థల నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఇంటర్ జిల్లా విద్యా పర్యవేక్షకురాలు నీలావతిదేవి మాట్లాడుతూ.. ఇంటర్ విద్య కీలకమని, ప్రతి ఒక్కరూ శ్రద్ధతో చదవాలన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్, పారా మెడికల్ కోర్సులలో ఉత్తీర్ణత సాధించిన వారికి పట్టా అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, వేద విద్యాసంస్థల అధినేత చింతాడ రమేష్, కళాశాల కరస్పాండెంట్ చింతాడ ప్రభావతి, అకడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్, ప్రిన్సిపాల్ సైదా నాయక్, అధ్యాపకులు కోటేశ్వరరావు, మాలతీ, సింధూష, నాగలక్ష్మీ, విద్యార్థినిలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహా సభలను జయప్రదం చేయాలి

నార్నెపాడు(ముప్పాళ్ల): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని కోరారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో బుధవారం సభలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న రజిని మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, సమానత్వం, విముక్తి నినాదంతో 1936వ సంవత్సరంలో మహిళా సంఘం ఏర్పాటు జరిగిందని, ఆనాటి నుంచి నేటికీ మహిళా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించి ఫలితాలు కూడా సాధించామని తెలిపారు. నిరంతరం ప్రజా మహిళా సమస్యలపై కృషి చేసే మహిళా సంఘం జిల్లా మహాసభ ఈనెల 10వ తేదీన తెలంగాణ పోరాటానికి ఉద్యమకారులకు అండగా నిలిచిన సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ళ గ్రామంలో జరగనుందని అన్నారు. ఈ మహాసభలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు రాయల శివ, ఇంజం పద్మ తదితరులు పాల్గొన్నారు.

రజకులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలి

సత్తెనపల్లి: రజకులను షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని పలు ప్రాంతాల్లో రజకులు ఎస్సీలుగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఆలోచించి రజకుల స్థితిగతులను మార్చి వారి ప్రాధాన్యత దృష్ట్యా వినతి స్వీకరిస్తారని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కృష్ణారెడ్డి డొంక, కుమ్మరకాలనీ, ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి ఏఎంజీ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

వినుకొండ: పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పల్నాడు జిల్లాగా నామకరణ చేయాలని ప్రజా సంఘాల నాయకులు, అఖిలపక్ష పార్టీల నాయ కులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జాషువా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నూతనంగా జిల్లాల పేర్లు మార్పులు, చేర్పుల కమిటీ తప్పకుండా పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా పేరును పరిశీలించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. న్యాయవాది పి.జె.లూకా, జాన్ సుందరరావు, వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే ఎలా?

యడ్లపాడు: అధికారులు ఉద్యోగ బాధ్యతలో సమయపాలన పాటించాలని ఎంపీపీ ఝాన్సీ చెప్పారు. యడ్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కొందరు అధికారులు సమావేశానికి ఆలస్యంగా హాజరుకావటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాసేవలో అలసత్వం వీడాలని అధికారులకు ఎంపీపీ ఝాన్సీ కోరారు. చంఘీజ్‌ఖాన్‌పేట సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతు గ్రామంలో ఎరువుల కొరత ఉందని, తమ గ్రామాన్ని యడ్లపాడు సొసైటీలో కలపటం వలన అక్కడి నుండి ఎరువులు తీసుకురావటానికి రైతులకు ఆర్థికభారమైందన్నారు. ఏవో హరిప్రసాద్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో 15 టన్ను లు యూరియా, 5 టన్నులు డీఏపీ నిల్వలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతా దేవి, డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి ఎంఈఓ-1గా చిన్నపరెడ్డి

బొల్లాపల్లి: నూతన మండల విద్యాశాఖ అధికారి-1గా జి.చిన్నపరెడ్డి బుధవారం విధుల్లో చేరారు. వినుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి చిన్నపరెడ్డిని బొల్లాపల్లి ఎంఈఓ-1గా నియమిస్తూ విద్యాశాఖ ఆర్జెడి లింగేశ్వర్ రెడ్డి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని, దీంతో చిన్నపరెడ్డి బొల్లాపల్లి మండల విద్యాశాఖ అధికారి 1గా ఏఫ్ఏసీ బాధ్యతలు స్వీకరించారు.

పెచ్చు మీరిన మందుబాబుల ఆగడాలు

నరసరావుపేట టౌన్: పట్టణంలో మందుబాబుల ఆగడాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నా రు. వినాయక నిమజ్జన ఊరేగింపులో విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లపై రెండు రోజుల క్రితం మందుబాబుల దాడి మరువక ముందే మంగళవారం అర్ధరాత్రి శ్రీనివాసనగర్‌లో ఓ ఇంటి అద్దాలు పగుల గొట్టి నానా హంగామ సృష్టించారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు కేకలు వేస్తూ ఏ1 బార్ అండ్ రెస్టారెంట్ వెనుక ప్రాంతంలోని ఓ ఇంటి అద్దాలపై రాళ్ల విసిరి పగులగొట్టారు. ఆ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పెద్దపెద్ద కేకలు వేసి నానా బీభత్సం సృష్టించారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.